క్లుప్తంగా

ఉపాధి పథకంతో అభివృద్ధి పనులు



వాడ్రాపల్లిలో ఉపాధి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ నూకరాజు

మునగపాక : ఉపాధిహామీ పథకాన్ని సద్విని యోగం చేసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. మంగళవారం వాడ్రాపల్లిలో ఆయన ఉపాధిహామీ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీల అభివృద్ధికి ఉపాధిహామీ పథకం దోహదపడుతుందన్నారు. వలస కూలీలను నివారించేందుకు ఈ పథకం ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

మునగపాక ఎస్ఐగా ఆలీ



ఎస్ఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆలీ

మునగపాక : మునగపాక పోలీసుస్టేషన్ ఎస్ఐగా మహమ్మద్ ఆలీ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత ఎస్ఐగా పనిచేసిన భీమరాజును అనకాపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో చింతపల్లి ఎస్ఐగా పనిచేసిన ఆలీని మునగపాకకు బదిలీ చేశారు. ఈ మేరకు ఆలీ తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ మునగపాక మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడతానని అలాగే అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూస్తానన్నారు.

రేపు గౌతమ పఠన మందిరం వార్షికోత్సవం

మునగపాక : మునగపాకలోని గౌతమ పఠన మందిరం 48వ వార్షికోత్సవం ఈ నెల 26న ఘనంగా నిర్వహిస్తున్నట్టు మందిర సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జెండా ఆవిష్కరణ, విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు, సాయంత్రం మ్యూజికల్ చైర్స్, స్కిప్పింగ్ పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. రాత్రి 7.30 గంటలకు ఆదర్శ రైతు కుటుంబాలకు సన్మానం, బహుమతుల పంపిణీ జరుగుతుందన్నారు. రాత్రి 8గంటలకు గుంటూరుకు చెందిన శ్రీ సద్గురు కళానిలయం వారి బహురూపి సాంఘిక నాటిక ప్రదర్శన జరుగుతుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పేదలకు రగ్గుల పంపిణీ



తిమ్మరాజుపేటలో రగ్గులు పంపిణీ చేస్తున్న దృశ్యం

మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేటలోని దళితవాడలో మంగళవారం రాత్రి పేదలకు రగ్గుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అచ్యుతాపురంలోని సుందర అల్లాయిస్ పరిశ్రమ సహకారంతో తిమ్మరాజుపేట సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయి భజన మండలి కన్వీనర్ సరిసా శివ, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, వార్డు సభ్యులు మళ్ల అప్పలనాయుడు, ముప్పిడి శ్యామల, పీఏసీఎస్ చైర్మన్ ముప్పిడి కనకారావు, కుమారస్వామి, అప్పల నరసమ్మ, మూర్త అర్జున్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి హామీ వేతన దారులతో మాట్లాడుతున్న కమిషన్ బృందం

పాయకరావుపేట : నామవరం గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషన్ బృందం ఎం.లక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం పరిశీలించారు. ఉపాధి పనుల వివరాలు, రోజుకు ఎంత వేతనం గిట్టుబాటు, సౌకర్యాలు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో చేయవలసిన పనులు చురుగ్గా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బృందం సభ్యులు, ఏపీవో హేమలత పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు తెలుసుకోండి



బస్సు డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌టీవో వీర్రాజు, డీఎస్పీ ప్రవీణ్ కుమార్



పి.ధర్మవరం జంక్షన్ వద్ద స్టాపర్లు ఏర్పాటు చేస్తున్న పోలీసులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ షేక్ గఫూర్, ట్రాఫిక్ ఎస్ఐ ఈశ్వరరావు

పాయకరావుపేట : రోడ్డు నియమాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అనకాపల్లి జిల్లా రవాణా అధికారి ఎం.వీర్రాజు, అనకాపల్లి జిల్లా డీఎస్పీ ప్రవీణ్ కుమార్ తెలిపారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వీరు బస్సు డ్రైవర్లు, విద్యార్థులతో మాట్లాడారు. జిల్లాలో ప్రమాదాలు నివారించడానికి అన్ని ప్రభుత్వ విభాగాల నుంచి సుమారు 4000 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని, గత 7 రోజులుగా (జనవరి 18 నుంచి జనవరి 24) జిల్లా అంతటా రహదారి భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని రోడ్డుపై ప్రయాణించే వారు తగిన జాగ్రత్తలు తీసుకుని క్షేమంగా గమ్యస్థానాలను చేరుకోవాలని, రోడ్లపై ప్రయాణించే వారికి అవగాహన కల్పించవలసిన బాధ్యత ప్రతి విద్యార్థిపైన ఉందని అన్నారు. ప్రభుత్వం కూడా రహదారి ప్రమాదాల్లో గాయపడిన వారిని సకాలంలో ఆస్పత్రికి తీసుకుని వెళితే ప్రోత్సాహక బహుమతులు అందచేస్తుందని, సేవా భావంతో ముందుకు వచ్చే వారు సివిల్, క్రిమినల్ కేసుల్లో ఏ మాత్రం బాధ్యులు కాదన్నది గుర్తించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియామాలు పాటించాలని అన్నారు. అనంతరం విద్యార్థులు, డ్రైవర్లతో రహదారి భద్రతా నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వి.ఆర్ మూర్తి, ఎస్ఐ రమేష్, శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ హెచ్ఆర్, వి.వి.ఎస్.బి.బంగ్రారాజు, ట్రాన్స్‌పోర్ట్ ఇంఛార్జ్ సుబ్బారావు నాయుడు పాల్గొన్నారు.

పలు జంక్షన్లలో స్టాపర్ల ఏర్పాటు

ఎస్.రాయవరం : వాహన చోదకులు రోడ్డు భద్రతా నియమాలు పాటించినట్టయితే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని నక్కపల్లి సీఐ నారాయణరావు అన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాల్లో డ్రమ్‌లపై రేడియం స్టిక్కరింగ్, పెయింటింగ్ చేయించి స్టాపర్లుగా ఏర్పాటు చేశారు. మండలంలో గోకులపాడు, పి.ధర్మవరం, పెనుగొల్లు, కోనవానిపాలెం జంక్షన్ల వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండడంతో స్టాపర్లు ఏర్పాటు చేశారు. ద్విచక్రవాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని, రాంగ్ రూట్‌లలో ప్రయాణాలు మానుకోవాలని సూచించారు. ఎస్.రాయవరం ఎస్ఐ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు

యలమంచిలి : విద్యార్థి దశ నుండే ఉన్నత శిఖరాలను నిర్దేశించుకోవాలని యలమంచిలి పట్టణ సీఐ షేక్ గఫూర్ అన్నారు. మంగళవారం యలమంచిలిలో జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా 'రహదారి భద్రత-జీవితానికి రక్ష' అనే నినాదంతో పట్టణంలో ఉన్న అన్ని పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించి వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సీఐ మాట్లాడారు. విద్యార్థులంతా పోటీతత్వం అలవర్చుకోవాలని, ప్రతి ఒక్కరు విధిగా భద్రతా నియమాలు పాటించాలని, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. వ్యాసరచనలో విజేతలను అభినందించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ ఈశ్వరరావు, పాఠశాలల ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత విద్యావంతులు కావాలి



స్వాభిమాన్‌పై అవగాహన ర్యాలీ

పాయకరావుపేట : బాలికలు ఉన్నతమైన విద్యావంతులుగా ఎదగాలని ఐసీడీసీ సీడీపీవో ఎం.శ్రీవిద్య అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పట్టణంలో గల జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల్లో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో శ్రీ విద్య మాట్లాడుతూ బాలికలు వారి హక్కులు, ఉన్నత విద్య, ఆడపిల్లలు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అదే విధంగా స్వాభిమాన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఆహారపు అలవాట్లుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎనీమియా నివారణ చర్యలపై అవగాహన పొందాలని విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం స్వాభిమాన్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీసీ సూపర్‌వైజర్ జి.సాజన్య, ఐసీడీసీ సిబ్బంది ఎం.రాఘవ, లావణ్య, రాధామణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేడు నక్కపల్లిలో ఓటర్ల దినోత్సవం

నక్కపల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం 11వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుతున్నామని తహసీల్దార్ సుబ్రహ్మణ్య శాస్త్రి తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా ఓటు హక్కు పొందిన వారికి ఎపిక్ కార్డులు అందజేయడంతో పాటు, సీనియర్ సిటిజన్లను సన్మానించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఓటర్ల నమోదు అధికారి, సింహాచలం దేవస్థానం ఎస్‌డీసీ రామలక్ష్మి హాజరవుతారన్నారు.

వైభవంగా అభయాంజనేయ తీర్థం



రంగవల్లుల పోటీలో విజేతకు బహుమతి అందజేస్తున్న గ్రామ పెద్దలు

కోటవురట్ల : కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవం వైభవంగా జరిగింది. స్వామికి విశేష పూజలు చేశారు. సమీప గ్రామాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రంగవల్లులు, వాలీబాల్ పోటీలు ఆకట్టుకున్నాయి. విజేతలకు కమిటీ సభ్యులు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎస్.రమణ, మాజీ జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దాబత్తుల సత్యనారాయణ, సిద్దాబత్తుల నాగేశ్వరరావు, పెన్నాడ రాంబాబు, వంతర నాగేశ్వరరావు, మేడిశెట్టి నానాజీ, అనపర్తి వరహాలు పాల్గొన్నారు.

విఘ్న గణపతి సంస్థ సేవలు అభినందనీయం



పేదలకు దుప్పట్లు అందజేస్తున్న ప్రసాద్

మునగపాక : విఘ్న గణపతి సేవా సంస్థ సేవలు అభినందనీయమని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కొనియాడారు. మునగపాకలోని సాంబశివుని ఆలయ ప్రాంగణంలో సంక్రాంతి పర్వదినాల్లో భాగంగా విఘ్న గణపతి సేవా సంస్థ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా 18 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా పేదలకు వస్త్రదానం చేస్తున్న సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు అలంక ప్రకాశరావు, అనకాపల్లి సూరిబాబులను ఆయన అభినందించారు. ఇరువురిని ఆదర్శంగా తీసుకొని మునగపాకలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కోనపల్లి రామ్మోహనరావు, పాలసంఘ అధ్యక్షుడు మళ్ల సంజీవరావు, సూరిశెట్టి కన్నారావు, సుధారాజి,దాడి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

నేడు గవరపాలెం గౌరీపరమేశ్వరుల కల్యాణం

అనకాపల్లిటౌన్ : గవరపాలెం గౌరీపరమేశ్వరుల మహోత్సవాన్ని పురస్కరించుకుని గౌరీపరమేశ్వరుల వార్షిక కల్యాణం బుధవారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు మంగళవారం తెలిపారు.

అంగరంగ వైభవంగా ఆంజనేయస్వామి పండగ



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు, నాయకులు

నక్కపల్లి : ఉద్దండపురంలో ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా సంక్రాంతి అనంతరం వచ్చే మొదటి మంగళవారం స్వామివారి వార్షికోత్సవాన్ని జాతరగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆంజనేయ హోమాలు, విశేష పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది మంది తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా జాతరలో తప్పెటగుళ్ల ప్రదర్శనలు, కోలాటాలు, భజనలు, డాన్స్ బేబీ డాన్సు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, సర్పంచ్ పొడగట్ల వెంకటేష్, ఎంపీటీసీ బచ్చల రాజు, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, సర్పంచ్‌లు సాదిరెడ్డి శ్రీను, సురేష్‌వర్మ, ఎంపీటీసీలు తిరుపతిరావు, గోవిందు, తోట సత్తిబాబు, పార్టీ నాయకులు కోమర్తి బాబూరావు, రాజా, ప్రకాశరావు తదితరులు దర్శించుకున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



కోటవురట్ల అంగన్‌వాడీ ప్రాజెక్టు వద్ద ఆందోళన చేస్తున్న సిబ్బంది

కోటవురట్ల : అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు కనీస వేతనం అమలు చేయాలని అంగన్‌వాడీ సిబ్బంది మంగళవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మాకవరపాలెం, నాతవరం, కోటవురట్ల మండలాలకు చెందిన అంగన్‌వాడీ సిబ్బంది ఆందోళనలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ బిల్లులు మంజూరు చేయాలని, గ్రాట్యూటీ, పదవీ విరమణ ప్రయోజనాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ సభ్యులు పుష్పకుమారి, చిన్నమ్మి పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి

ఎస్.రాయవరం : పాఠశాలలో విద్యార్థుల అకడమిక్ ప్రమాణాలు మెరుగు పడకపోతే ఉపాధ్యాయులకు చర్యలు తప్పవని జిల్లా ఉపవిద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలో పలు పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి పలు ప్రశ్నలు వేశారు. వర్కు బుక్ కరెక్షన్స్ పరిశీలించారు. ఉపాధ్యాయులు ప్రమాణాల ప్రకారం బోధన జరపకపోతే సహించేది లేదని అన్నారు. ఉపాధ్యాయులు సకాలంలో తరగతులకు హాజరై బోధన జరపాలని సూచించారు. అనంతరం ఆయా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహణను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యా ప్రమాణాలు పాటించని నలుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఇకపై ఎప్పటికప్పుడు తనిఖీలు ఉంటాయని, బోధనలో మార్పు తీసుకురావాలని చెప్పారు. ఈ పరిశీలనలో మండల విద్యాశాఖాధికారి ఎ.ఎస్ఎన్.ఎన్ మూర్తి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, కొత్త రేవుపోలవరం సర్పంచ్ మల్లే లోవరాజు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు



మార్టూరులో స్థానికులకు నవరత్నాల పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి) : సంక్షేమ పథకాల అమల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందుందని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. అచ్యుతాపురం మండలంలోని వెదురువాడ సచివాలయం పరిధిలో ఉన్న మార్టూరు, గెడ్డ దగ్గర రాజుల ఇళ్లు, వెదురువాడ ఎస్సీ కాలనీలలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నబాబురాజు గ్రామంలోని అందరినీ పలకరిస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ పథకాల అమలులో సీఎం జగన్ పారదర్శకతకు పెద్ద పీట వేస్తున్నారని, ఎటువంటి సిఫారసులకు ఆస్కారం లేకుండా అర్హులందరికీ న్యాయం చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు సంక్షేమాన్ని చేరవేయడంలో వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని అన్నారు. నవరత్నాల కరపత్రాలను గడప గడపకు వెళ్లి అందజేశారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ ఫలాలను వివరించారు. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అంబేద్కర్ విగ్రహానికి, పాఠశాలలోని సరస్వతీదేవి విగ్రహానికి పూల మాల వేశారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ , జెడ్పీటీసీ లాలం రాంబాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, ఎంపీపీ భర్త, మండల పార్టీ నాయకులు కోన బుజ్జి, పార్టీ అధికార ప్రతినిధి పిన్నంరాజు వాసు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా గృహసారథుల నియామకం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పాపారావు తదితరులు

నక్కపల్లి : ఈ నెలాఖరులోగా సచివాలయాల పరిధిలో గృహ సారథుల నియామకం పూర్తిచేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నక్కపల్లి మండల అధ్యక్షుడు పొడగట్ల పాపారావు సూచించారు. మంగళవారం ఆయన ఉద్దండపురంలో కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వెలగా ఈశ్వరరావుతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి, పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జ్ వై.వి.సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఆదేశాల మేరకు సచివాలయ కన్వీనర్లను నియమించడం జరిగిందన్నారు. ఈ కన్వీనర్లంతా వలంటీర్లతో సమన్వయం ఏర్పాటు చేసుకుని ప్రతి 50 కుటుంబాలకు ఇద్దరు గృహసారధులను ఎంపిక చేయాలన్నారు. వీరిలో ఒక మహిళ ఉండాలన్నారు. ఈ ప్రక్రియ జనవరి 31 నాటికి పూర్తి చేసి జాబితాలను స్థానిక ఎమ్మెల్యేతో పాటు, పార్టీ జిల్లా అధ్యక్షులకు అందజేయాల్సి ఉంటుందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పనిచేసిన వారినే గృహసారధులుగా ఎంపిక చేయాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్ల కలిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా లేదా, అనేది పర్యవేక్షించడంతోపాటు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీని వార్డు స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. సైనికుడిలా పనిచేసి 2024 ఎన్నికల్లో రెండోసారి అధికారాన్ని కైవసం చేసుకునే దిశగా పనిచేయాలన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు పొడగట్ల వెంకటేష్, సాదిరెడ్డి శ్రీను, తళ్ల భార్గవ్, సురేష్‌వర్మ, ఎంపీటీసీలు తోట సత్తిబాబు గంటా తిరుపతిరావు, గొర్ల గోవిందు, మాజీ ఎంపీటీసీ కొప్పిశెట్టి హరిబాబు, స్కూల్‌కమిటీ చైర్మన్ లక్ష్మణరావు, పార్టీ నాయకులు పొడగట్ల రాజా, ప్రకాశరావు, కనకయ్య పాల్గొన్నారు.

చెత్తకుండీల సరఫరాపై నిలదీసిన కౌన్సిల్ సభ్యులు






సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి , హాజరైన కౌన్సిల్ సభ్యులు

యలమంచిలి : యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో వాడివేడిగా జరిగింది. అధికారుల తీరుపై అధికార పక్షం కౌన్సిల్ సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుత సమావేశంలో 29 అంశాలతో కూడిన అజెండాను సభలో చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అధ్యక్షతన ప్రవేశపెట్టారు. మున్సిపాలిటీలో ప్రజలకు ఉచితంగా అందించవలసిన తడి చెత్త పొడి చెత్తను వేరు చేసే చెత్తకుండీలు సరఫరాలో అవకతవకలు చోటు చేసుకున్నాయని మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్తా ఆరోపించారు. ఎన్ని చెత్తకుండీలు సరఫరా చేశారు..ఎన్ని కుండీలు మిగిలినవి, వాటిని ఎక్కడ భద్రపరిచారని అధికారులను నిలదీశారు. దీనిపై మున్సిపల్ అధికారులు ఒక ప్రవేట్ షాపులో భద్రపరిచామని సమాధానం తెలిపారు. అయితే వాటిని భద్రపరిచిన షాపు వద్ద పరిశీలించగా అధికారులు చెప్పిన లెక్కలకు, అక్కడ ఉన్న చెత్తకుండీలకు పొంతన లేకపోవడంతో కౌన్సిల్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల స్వర్గస్తులైన విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు మృతికి కౌన్సిల్ సభ్యులు, అధికారులు సభలో సంతాపం వ్యక్తం చేశారు. తులసీరావు కాంస్య విగ్రహం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేయడానికి సభ్యుల ఆమోదంతో తీర్మానించారు. వైస్ చైర్మన్ గుప్తా మాట్లాడుతూ అధికారులు మున్సిపాలిటీలో జగనన్న కాలనీలు త్వరితగతిన నిర్మించేలా అధికారులు పర్యవేక్షణ కొరవడిందని, అధికారులు తీరుతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని కాలనీలకు మౌలిక వసతులు కల్పించి త్వరగా నిర్మించేటట్టు చూడాలని అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరావు మాట్లాడుతూ మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుల ఖాళీలను గుర్తించి సిబ్బంది కొరత లేకుండా చూడాలని చైర్‌పర్సన్‌కు తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు కర్రి లక్ష్మి, పందూరి హరినాథ్, పడాల కావ్య, దాసరి చిన్నమ్మలు, పిట్టా సత్తిబాబు, రాయి భార్గవి, దూది నర్సింహమూర్తి, గొర్లె సంధ్య, కమిషనర్ తోట కృష్ణవేణి, డీఈ వీరయ్య పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



పాటిపల్లి బీసీ కాలనీలో ర్యాలీ



కోటవురట్ల కేజీబీవీలో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సుజాత

ఎస్.రాయవరం : బాలికలు అన్ని రంగాల్లో రాణించాలంటే విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కస్తూర్బా ఎస్‌వో కల్పన అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని తిమ్మాపురం కస్తూర్బా విద్యాలయంలో మంగళవారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు విద్యలో మంచి ఫలితాలు సాధిస్తే కుటుంబంలోనూ, సమాజంలోనూ మంచి గుర్తింపు వస్తుందన్నారు. చదువుకున్న మహిళ గృహిణిగా ఎన్నో మార్పులు తీసుకువస్తుందన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

కోటవురట్ల : బాల్య వివాహాలను నివారించాలని సీడీపీవో సుజాత కోరారు. స్థానిక కేజీబీవీలో జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ చిన్న వయస్సులో బాలికలకు ఆలోచనా శక్తి తక్కువగా ఉంటుందని, బాల్య వివాహాల వల్ల మానసికమైన ఒత్తిడికి గురవుతారన్నారు. శారీరకంగా కూడా బలహీనపడే అవకాశం ఉందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిపితే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని పాటిపల్లి బీసీ కాలనీలో మంగళవారం జాతీయ మహిళా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేకాధికారి రాణి మాట్లాడుతూ బాలికలు ఆరోగ్యవంతంగా ఉండాలంటే సరైన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఆడ పిల్లలను బాగా చదివించాలని అలాగే ఎదగనివ్వాలని నినాదాలు చేయించారు. రక్తహీనతకు గురికాకుండా బాలికలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పెంటకోట సుజాత, మహిళా పోలీసు బేగం, ఆశ కార్యకర్తలు భవానీ, చంద్రకళ, విద్యార్థినులు పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత నివారణ



కోటవురట్లలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

కోటవురట్ల: పోషకాహారంతో రక్తహీనతను నివారించవచ్చని కార్యదర్శి సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక సచివాలయ పరిధిలో రక్తహీనత నివారణపై అవగాహన కల్పిస్తూ మంగళవారం ర్యాలీ చేశారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు పోషకాహారం ప్రాధాన్యతను వివరిస్తూ నినాదాలు చేశారు. ఇంట్లో లభించే కూరగాయలు, పప్పుదినుసులతో పోషకాహారం తయారు చేసుకునే విధానాన్ని వివరించారు.కార్యక్రమంలో సర్పంచ్ అనిల్ కుమార్, ప్రిన్సిపాల్ కొండబాబు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.